క్లుప్తంగా

సకాలంలో వైద్య సేవలు అందించాలి



వేళంగి పీహెచ్‌సీలో వివరాలు తెలుసుకుంటున్న డీఐఓ సుబ్బరాజు

కరప: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు ఆదేశించారు. మండలంలోని వేళంగి పీహెచ్‌సీని బుధవారం ఆయన స్టాటిస్టికల్ ఆఫీసర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎస్‌ఓ గిరిగణేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి, వైద్య సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న వైద్య పరీక్షల వివరాలను, ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం, గర్భిణుల పరీక్షలు, గ్రామాలకెళ్లి అందిస్తున్న వైద్య సేవలు తదితర విషయాలను డాక్టర్ ఎంకే సౌజన్య వివరించారు. పీహెచ్‌సీ పనితీరును డీఐఓ డాక్టర్ సుబ్బరాజు అభినందించారు. పీహెచ్‌సీ ఎంపీఓ గోవిందబాబు, హెచ్‌ఎస్ రమణారావు, హెచ్‌వీ సూర్యకుమారి, ఫార్మాసిస్ట్ త్రినాథకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైకిల్ యాత్ర

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలేనికి చెందిన భక్తులు చేపట్టిన అయోధ్య సైకిల్ యాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. యాత్ర బుధవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. మధ్యప్రదేశ్‌లోని భేలా అనే ఊరులో బస చేసి, అలహాబాద్ హైవేలో ప్రయాణం సాగిస్తున్నట్టు వాసంశెట్టి వీరభద్రం తెలిపారు.

చిన్నారులకు టపాసుల పంపిణీ



చిన్నారులకు టపాసులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: దీపావళి పండగను పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో బుధవారం చిన్నారులకు టపాసులను పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ ప్రతినిధి అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దీపావళి పండగను జాగ్రత్తలు పాటిస్తూ జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు దగ్గర ఉండాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్ నాయుడు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

3న దండపాణి గురుస్వామి విగ్రహావిష్కరణ

బోట్‌క్లబ్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు అయ్యప్ప దీక్షను పరిచయం చేసిన దండపాణి గురుస్వామి విగ్రహాన్ని కాకినాడ భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ తెలిపారు. ఆలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దండపాణి గురుస్వామి శత జయంతి మహోత్సవాల సందర్భంగా నవంబర్ 3న రాత్రి ఏడు గంటలకు ఆయన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాపరులు హాజరుకావాలని ఆయన కోరారు.

దేవతామూర్తులున్న టపాసులు కాల్చవద్దు

బోట్‌క్లబ్: నిత్యం గణపతి, లక్ష్మీదేవిని ప్రతి హిందువు పూజిస్తారని, అటువంటి పవిత్రమైన దేవతామూర్తుల చిత్రాలున్న టపాసులను కాల్చడం సరికాదని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక టూటౌన్ సమీపంలో ఉన్న మునసబుగారి వీధిలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవతామూర్తుల చిత్రాలతో కూడిన టపాసులు తయారుచేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాంటి టపాసులు కొనుగోలు చేయవద్దని కోరారు.

సీనియర్ న్యాయవాది సుధాకరరావు మృతి



సుధాకరరావు(ఫైల్)

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది కె.సుధాకరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వస్తుండగా విజయవాడ వద్ద కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన గతంలో కాకినాడ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

నగరానికి దీపావళి శోభ

- బాణసంచా విక్రయాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- వివిధ ప్రాంతాల్లో 121 స్టాళ్ల ఏర్పాటు
- పర్యావరణ హితం కోసం గ్రీన్ టపాసులు



మెక్లారిన్ గ్రౌండ్‌లో దీపావళి సామాన్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

బోట్‌క్లబ్/కాకినాడ సిటీ: దీపావళి అంటే ఇంటిల్లిపాది ఎంతో సంతోషంగా చేసుకునే పండగ, టపాసులు కాల్చడమంటే పిల్లలు ఎంతో సంబరపడతారు. సంతోషాల దీపావళిని ఆనందకర వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పర్యావరణ హితంగా ఉన్న గ్రీన్ టపాసులు మాత్రమే కాల్చాలని అధికారులు కోరుతున్నారు. మరోవైపు దీపావళి సామగ్రి విక్రయించడానికి తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేశారు. కాకినాడ నగరంలో స్థానిక మెక్లారిన్ హైస్కూల్, బోట్‌క్లబ్, డీసీఎంఎస్ గోడౌన్ వద్ద మొత్తం 121 తాత్కాలిక స్టాళ్లు ఏర్పాటు చేసుకొని దీపావళి సామాన్లు విక్రయిస్తున్నారు. మంగళవారం నుంచి బాణసంచా విక్రయాలకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో, రాత్రి నుంచి ఆయా దుకాణాల్లో సామగ్రి అమ్మకాలకు సిద్ధం చేసుకున్నారు. దీంతో సామాన్లు విక్రయించే దుకాణాలు రద్దీగా మారాయి. నగరంలో పలు వీధుల్లో దీపావళి ప్రమిదలు విక్రయించే దుకాణాలు ఏర్పాటు చేయడం, ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు రావడంతో ఆయా షాపులు వద్ద రద్దీ నెలకొంది. ఇక దీపావళి సామాన్లు కొనుగోలు చేసేందుకు స్థానిక మెక్లారిన్ హైస్కూల్ వద్దకు అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో అక్కడా రద్దీ ఏర్పడింది. అప్రమత్తంగా వ్యవహరించి కుటుంబ సమేతంగా ఆనంద దీపావళి జరుపుకోవాలని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు సూచించారు.

వాతావరణ మార్పులతో హడల్

బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణంలో మార్పులు రావడంతో దీపావళి సామాన్లు విక్రయించే దుకాణ యజమానులు హడలిపోయారు. ఒకసారి చిరుజల్లులు పడడంతో తాము తెచ్చుకున్న స్టాక్ అమ్ముడుకాకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు. అయితే మబ్బు మాత్రం అలాగే ఉండడంతో, వర్షం కురవకూడదని దేవుడికి ప్రార్థించారు. ఈ స్టాకు కానీ అమ్ముడు కాకుండే మళ్లీ సంవత్సరం వరకూ వీటిని దాచిపెట్టుకోవాలని, ప్రస్తుతం దుకాణానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల పెట్టుబడి పెట్టినట్లు షాపు యజమానులు తెలిపారు. లాభాలు రాకున్నా, కనీసం పెట్టుబడులు వస్తే చాలని పలువురు వ్యాపారులు చెబుతున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

స్టాల్, స్టాల్‌కు మధ్య పది అడుగుల వ్యత్యాసం ఉండాలి. ప్రతి స్టాల్ ముందు బకెట్లతో ఇసుక, డ్రమ్ముల్లో నీరు ఉంచుకోవాలి. సక్రమమైన విద్యుత్ వైరింగ్ ఉండాలి. విద్యుత్, అగ్నిమాపక అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. దుకాణాల ఏర్పాటుకు ఐరన్, సిమెంట్ షీట్లు మాత్రమే వాడాలి. దుకాణాల్లో చిన్న పిల్లలు ఉండకూడదు. అలా ఉంటే వారిపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగితే వినియోగదారులతో పాటు, షాపులో పనిచేసేవారు తప్పించుకునేందుకు రెండు మార్గాలు ఉండాలి.



ఐటీఐ రోడ్డులో దీపావళి ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెరిగిన బాణసంచా ధరలు

ఇదిలాఉండగా గతేడాదితో పోలిస్తే బాణసంచా ధరలు ఈసారి పేలిపోతున్నాయి. ఏకంగా 20 నుంచి 30 శాతం మేర ధరలు పెరిగాయి. దీంతో సాధారణ, మధ్య తరగతి వర్గాల ప్రజలు బాణసంచా కొనుగోళ్లు తగ్గించారు. ప్రస్తుతం కాకరపువ్వోత్తులు సైజును బట్టి బాక్స్ రూ.40 నుంచి రూ.150, చిచ్చుబుడ్లు బాక్స్ రూ.200 నుంచి రూ.వెయ్యి, 1000 వాలా రూ.600 నుంచి రూ.800, అలాగే 5000 వాలా రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు, లక్ష్మీబాంబుల బాక్స్ రూ.300 నుంచి రూ.350 వరకు, భూచక్రాల బాక్స్ రూ.120 నుంచి రూ.180, తాళ్ల బాక్స్ రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు.

ధరలు చూస్తే భయమేస్తోంది

మధ్యతరగతి, సామాన్య ప్రజలు టపాసులు కొనలేని పరిస్థితి ఉంది. ప్రతి ఏడాది ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఆ ధరలను చూస్తే భయమేస్తుంది. గతంలో రూ.వందల్లో పెట్టి కొంటే వచ్చే టపాసులు ఇప్పుడు రూ.వేలు పెట్టి కొన్నా రావడం లేదు. టపాసుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కోనాడి దుర్గాప్రసాద్, సంజయ్‌నగర్, కాకినాడ

పండగ భారంగా మారింది

నిత్యావసరాలతో పాటు, టపాసుల ధరలు విపరీతంగా పెరగడంతో దీపావళి పండగ భారంగా మారింది. పిల్లల సంతోషం కోసం టపాసులు కొనుగోలు చేయక తప్పడం లేదు. మార్కెట్‌లో ధరల నియంత్రణపై ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సామాన్యులు కొనలేకపోతున్నారు

– బి.పుష్ప, పర్లోవపేట, కాకినాడ

అమ్మవారిని దర్శించుకున్న డీఆర్‌ఓ



బాలాత్రిపుర సుందరి అమ్మవారి సన్నిధిలో డీఆర్‌ఓ వెంకట్రావు

బోట్‌క్లబ్: కాకినాడ జిల్లా డీఆర్‌ఓగా నియమితులైన జె.వెంకట్రావు బుధవారం స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు.

రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించాలి

కాకినాడ సిటీ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గురువారం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి జిల్లా అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది రాష్ట్రీయ ఏక్తా ప్రతిజ్ఞ చేయాలన్నారు. పోలీస్ దళాలు యూనిటీ మార్చ్ కార్యక్రమాలను, డివిజన్, మండల, మున్సిపల్ అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో రన్ ఫర్ యూనిటీ పరుగు నిర్వహించాలన్నారు. జైళ్లలో దేశ సమగ్రత అంశంతో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

రీ సర్వే సభలు సద్వినియోగం చేసుకోండి



గ్రామ సభలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్ సత్యనారాయణ

కరప: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు కోరారు. స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో బుధవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన రీ సర్వే గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ, రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా దరఖాస్తు చేసుకుంటే, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, పరిష్కరిస్తారన్నారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంతవరకు 9 గ్రామాల్లో రీ సర్వే గ్రామసభలు నిర్వహించామని, వివిధ భూ సమస్యలపై 728 దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామసభలు పూర్తయిన వెంటనే ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రైతుల సమక్షంలో సర్వే చేస్తామన్నారు. రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా రైతుల నుంచి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. రీ సర్వే డీటీ డి.దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, దేవదాయ శాఖ ఈఓ కె.తిరుమల రవితేజ, వీఆర్వోలు పీఎంవీ ప్రసాదశర్మ, వి.వెంకటరమణ, వీఏస్‌లు జి.అర్జున్, కె.జనని తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడిగా సాగర్



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న సభ్యులు

కాకినాడ రూరల్: కాకినాడ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఎన్నికయ్యారు. స్థానిక రమణయ్యపేట వైద్యనగర్‌లోని బెన్సీ చర్చ్‌లో బుధవారం జరిగిన జిల్లా సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రెండేళ్లుగా సేవలందించిన కార్యవర్గానికి సభ్యులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా సామ్యూల్ సాగర్, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ జోసెఫ్ బెన్నీ, కార్యదర్శులుగా శీరం ఐజక్, డాక్టర్ డి.విక్టర్ సామ్యూల్, కోశాధికారులుగా పి.సురేంద్ర, విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంఎస్ విలియమ్స్, దడాల విలియమ్స్, జాషువ గిరి, జాన్ వెస్లీ, సువర్తపాల్, విజయ్‌కుమార్, సింగ్ తదితరులు అభినందనలు తెలిపారు.

రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, కోచ్ సమీర్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ, అక్కు అంతర్ కళాశాల పోటీలలో విశేష ప్రతిభను కనబర్చారని డీఎస్‌ఏ రైఫిల్ షూటింగ్ కోచ్ సమీర్ బుధవారం తెలిపారు. డీఎస్‌ఏలో శిక్షణ పొందుతున్న జి.మల్లేశ్వరి, జి.కాశి, ఎం.హర్షవర్ధ అక్కు అంతర్ కళాశాలల పోటీలలో రజత పతకాలు, షేక్ మొహియుద్దీన్ రాజమహేంద్రవరంలో నిర్వహించిన పీప్ సైట్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. వీరు త్వరలో జరిగే జాతీయ స్థాయి అంతర్ యూనివర్సిటీ, ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–17 నేషనల్స్‌కు ఎంపికైనట్లు కోచ్ సమీర్ తెలిపారు. బుధవారం డీఎస్‌ఏలో జరిగిన కార్యక్రమంలో డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ క్రీడాకారులను, కోచ్‌ను అభినందించారు.

కలెక్టరేట్ వద్ద పీడీఎస్‌యూ ధర్నా

కాకినాడ సిటీ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్దూ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కాలేజీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ఇతర పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా విద్యార్థుల సంక్షేమ పథకాలపై సమీక్ష జరపలేదన్నారు. ఇంజినీరింగ్ యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ప్రతి విద్యార్థికి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు ఎం సాయికిరణ్, ఎం మూర్తి, సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

బోట్‌క్లబ్: సంగీత స్రవంతి నెలవారీ గాన సభల్లో భాగంగా బుధవారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో మహేంద్రవాడ నరసింహమూర్తి శిష్యులు ఆలపించిన ముత్తుస్వామి దీక్షితర్ కృతుల గానం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ప్రముఖ సంగీత విద్యాంసురాలు పెద్దాడ సూర్యకుమారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం చిలుకూరి సుబ్బలక్ష్మి శిష్య బృందం గాత్ర కచేరి, ప్రభల రాజేశ్వరి, ఎం విజయకుమారి గాత్ర కచేరి అలరించింది. అలాగే షేక్ సుభాన్ సాహెబ్, పుసుపులేటి వేంకటరమణ, షేక్ రెహమాన్, రాయుడు బ్రదర్స్, షేక్ నజీర్ నాదస్వర కచేరి ప్రేక్షకులను మైమరపించింది.

ఆరో రోజుకు క్లాప్ డ్రైవర్ల ఆందోళన

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్ల బకాయి వేతనాలు చెల్లించాలని చేపట్టిన ఆందోళన బుధవారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, పండగలో కూడా కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బకాయిలు చెల్లించాలన్నారు. సోమవారం నాటికి ప్రభుత్వం నుంచి దీనిపై స్పష్టత రావచ్చని అదనపు కమిషనర్ సుధాకర్ తెలిపారు.

జనరిక్ మందులను ప్రజలకు చేరువ చేయాలి

కాకినాడ సిటీ: పీఎంబీజేకేఎస్ అవుట్‌లెట్ జనరిక్ మందుల షాపులను ప్రజలకు చేరువ చేయాలంటూ రెవల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ నేతలు మాట్లాడుతూ, జనరిక్ మందుల కొనుగోలులో ప్రజలు పూర్తి స్థాయిలో సఫలం కాలేకపోతున్నారన్నారు. బ్రాండ్ల పేరుతో డాక్టర్లు మందుల చీటీలు రాయడం వల్ల వాటినే సామాన్య ప్రజలు కొంటున్నారని చెప్పారు. జనరిక్ మందులను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. నాయకులు రంబాల సతీష్, శివకోటి రాజు, దూసర్లపూడి రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఇండియన్ యోగా ఫెడరేషన్ సహకారంతో ఏపీ యోగా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కాకినాడ క్రీడాకారులు ప్రతిభను కనబర్చారని డీఎస్‌ఏ యోగా కోచ్ ఇందిర బుధవారం ఇక్కడ తెలిపారు. జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు 14 మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, భూగర్భ జల శాఖ డిప్యూటీ హెచ్ రాధాకృష్ణ, రాజు అభినందించారు.

బాధిత కుటుంబానికి సాయం



పెద్దాపురప్పాడులో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న సభ్యులు

కరప: మండలంలో పెద్దాపురప్పాడు గ్రామంలోని బీసీవీధికి చెందిన పిల్లి గోవిందు పెద్ద కుమారుడు ఇటీవల మరణించాడు. ఆ కుటుంబానికి గ్రామ భీమ్‌రావ్ సిద్ధార్థ సేవా సంఘం సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా కిరాణా సామగ్రి, రూ 500 నగదు అందించారు. మాజీ సర్పంచ్ కనికెళ్ల సుబ్బారావు, సంఘ సభ్యులు పి.సునీల్, సాంబత్తుల గిరిధర్, కె.షెకెముబాబు, టి.అప్పారావు, లంక అప్పారావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

చదరంగ పోటీల్లో షరీఫ్‌కు గోల్డ్ మెడల్



షరీఫ్‌తో ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి జార్జి తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తెనాలిలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–14 చదరంగ పోటీలలో కాకినాడకు చెందిన షేక్ అబ్దుల్ ఖాదర్ షరీఫ్ ప్రతిభను కనబరిచాడు. రాష్ట్ర స్థాయిలో బాలుర టీం ఈవెంట్‌లో బంగారు పతకం సాధించాడు. స్థానిక రామారావుపేట నారాయణ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం డీఎస్‌ఏలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎల్.జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్, పాఠశాల ఏజీఎం రాఘవేంద్రరావు, జోనల్ అకడమిక్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి, ప్రిన్సిపాల్ షర్మిల, పీడీ సతీష్ అతడిని అభినందించారు.

యువత చురుగ్గా ఉండాలి

- రన్ ఫర్ యూనిటీ ప్రారంభించిన డీఎస్పీ రఘువీర్



రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): సమాజంలో యువత ఎప్పుడూ చురుగ్గా ఉండాలని డీఎస్పీ రఘువీర్ అన్నారు. పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో భాగంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ రఘువీర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ సంస్థానాల విలీనంలో చూపిన ధైర్యం, తెగువ వల్లే సువిశాల భారత దేశం సాధ్యమైందన్నారు. అనంతరం రన్‌ను డీఎస్పీ ప్రారంభించారు. ఈ రన్ కళాశాల నుంచి జెడ్పీ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంజనేయులు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జయదేవ్, డాక్టర్ పాండురంగారావు, ఎం.కృష్ణారావు, సీహెచ్ జాన్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి



ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ

కాకినాడ రూరల్: పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఏపీఎస్పీ సిబ్బంది బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రమణయ్యపేటలోని ఏపీఎస్పీ బెటాలియన్ క్యాంప్ కార్యాలయం వద్ద అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులను వెలిగించి పోలీసు అమరవీరులకు కమాండెంట్ దీపిక పాటిల్ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రమణయ్యపేటలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి ‘పాల్ హారిస్’ ప్రదానం



కర్రి బుచ్చిరెడ్డికి పాల్ హారిస్ సభ్యత్వాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: అంతర్జాతీయ రోటరీలో ప్రతిష్ఠాత్మకంగా భావించే పాల్ హారిస్ సభ్యత్వాన్ని సీనియర్ రోటరీ సభ్యుడు కర్రి బుచ్చిరెడ్డికి రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు ప్రదానం చేశారు. స్థానిక రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌లో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ సభ్యత్వానికి చెందిన పిన్‌ను బుచ్చిరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంతర్జాతీయంగా నిర్వహించే సేవా కార్యక్రమాలకు అవసరమైన నిధులను ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతారని, దీనికి విరాళాలు అందించే వ్యక్తులకు పాల్ హారిస్ అనే సభ్యత్వంతో గౌరవిస్తారని వివరించారు. దాంతో పాటు ప్రత్యేకంగా పిన్ కూడా అందజేస్తారనిన్నారు. అనేక శాశ్వత ప్రాజెక్టుల నిర్వహణ, ఇతర దేశాల్లో ఉన్న రోటరీ క్లబ్‌ల సంయుక్త సహకారంతో ఫౌండేషన్ నుంచి నిధులు మంజూరు చేస్తారన్నారు. పాల్ హారిస్ సభ్యత్వాన్ని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించడానికి ఆయా క్లబ్‌ల అధ్యక్షులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందిగా కోరారు. పోలియో మహమ్మారిని రూపుమాపడానికి వేలాది కోట్ల మంజూరు ఫౌండేషన్ సహకారంతో సాధ్యపడిందని చెప్పారు. అనంతరం కర్రి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, తాను 2009లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్‌లో సభ్యత్వాన్ని తీసుకున్నట్టు చెప్పారు .ఆ తర్వాత సంవత్సరమే క్లబ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించానన్నారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాక, తన మిత్రులను కూడా క్లబ్‌లో భాగస్వాములను చేశానన్నారు. సినీ హీరో మేడపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల ద్వారా అనేక మందికి మేలు చేసే వ్యక్తి బుచ్చిరెడ్డి అన్నారు. మహర్షి బులుసు సాంబమూర్తి పాఠశాలలో పిల్లలందరికీ బుక్స్, ఇతర సామగ్రితో పాటు, బియ్యం, క్రీడా వస్తువులు అందిస్తున్నారని చెప్పారు.